ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 31 మార్చి 2024



	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	39	26
భద్రాద్రి	39	27



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:27 (ఆదివారం)

సహర్ : 4:41 (సోమవారం)



పీవో, ఏపీవోలకు మూడు రోజుల శిక్షణ

- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 30: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక తెలిపారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణకు హాజరయ్యే ఎన్నికల సిబ్బంది తప్పని సరిగా ఎపిక్‌కార్డులను తీసుకురావాలని కోరారు. జిల్లాలో ప్రతీ శిక్షణ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా జిల్లా అధికారులను నియమిస్తున్నామని అన్నారు. ప్రతీ అధికారి వారికి కేటాయించిన కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లపై నివేదిక అందచేయాలని అన్నారు. ప్రభుత్వశాఖల ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ సదుపాయం కల్పించామన్నారు. 85 సంవత్సరాలు దాటిన వారు దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక



తాగునీటి సమస్యకు చెక్

- హైదరాబాద్‌లో సమీక్షించిన మంత్రి తుమ్మల
- రేపు పాలేరుకు సాగర్‌జలాల విడుదల

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 30: గత కొద్దికాలంగా ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య ఏర్పడిన నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం హైదరాబాద్‌లో సమీక్షించారు. మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమై తాగునీటి సమస్యపై చర్చించారు. ఖమ్మంనగరంలో తాగునీటి సమస్యను అధిగమించాలంటే పాలేరు రిజర్వాయర్‌కు సాగర్‌నీటిని విడుదల చేయాలని మంత్రి తుమ్మల కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఏప్రిల్ 1న పాలేరుకు సాగర్‌జలాలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.



మనసు దోచే మట్టి కుండలు

అందమైన డిజైన్లు, కళాత్మక నగిషీలు, వివిధ ప్రాంతాల మట్టితో రూపొందించిన కుండలు ఖమ్మం నగరంలో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.. వేసవితాపాన్ని తీర్చేందుకు సంప్రదాయ మట్టి కుండలు మార్కెట్ లో సిద్ధంగా ఉన్నాయి. ఎండల తీవ్రత రోజు రోజుకూ అధికం అవుతుండటంతో ప్రజలు కుండలను ఆశ్రయిస్తున్నారు. ఇళ్లల్లో వినియోగంతోపాటు కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, చలి వేంద్రాల వద్ద కుండలతో చల్లని నీటిని అందిస్తున్నారు. కుండలను పేదవాళ్ల ఫ్రిజ్‌లు అని అభివర్ణించటం పరిపాటి. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తమ ఇళ్లల్లో చల్లని నీళ్ల కోసం ఇంకా కుండలపైనే ఆధారపడుతుండటంతో వీటి ఆదరణ తగ్గలేదు.. స్థానిక కుమ్మరి కళాకారులు తయారు చేసిన లోకల్ మట్టి కుండలతోపాటు బెంగుళూరు, రాజస్థాన్, ఆదిలాబాద్ ప్రాంతాలకు చెందిన చేతి వృత్తి దారులు రూపొందించిన కుండలు సైతం నగరంలో కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. పరిమాణం, డిజైన్లను బట్టి కుండల ధరలు రూ. 150 నుంచి 400 వరకు ఉన్నాయి.

-ఖమ్మం సాంస్కృతికం



సస్పెన్స్.. థ్రిల్లర్..

ఎంతకీ తేలని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం

- 'హాట్‌సీటు' కోసం ఎవరికివారు మంకుపట్టు
- తాజాగా తెరపైకి రామసహాయం రఘురామిరెడ్డి, నందమూరి సుహాసిని పేర్లు...
- తీవ్ర కసరత్తు చేస్తున్న రాష్ట్ర నాయకత్వం
- అభ్యర్థి ప్రకటనలో మరింత జాప్యం జరిగే అవకాశం

ఖమ్మం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా కొలిక్కి వచ్చినా ఖమ్మం అభ్యర్థి ఎంపిక వ్యవహారం తేలడం లేదు. ఈ సీటుకోసం ఎవరికి వారు పట్టుబడుతుండడంతో అభ్యర్థి ఎంపిక అధిష్ఠానానికి పరీక్షగా మారింది. మరోవైపు ఈ సీటుకోసం రోజుకో కొత్తపేరు తెరపైకి వస్తుండడంతో చివరికి సీటు ఎవరికి దక్కుతుందోన్న చర్చ జోరుగా సాగుతోంది. ఖమ్మం లోక్‌సభ టికెట్‌ను ఈ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎవరికి టికెట్ ఇవ్వాలో అంతు చిక్కడం లేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడుప్రసాదరెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. తమవారి కోసం ముగ్గురు నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ ముగ్గురు మంత్రుల సంబంధీకులను కాదని వేరే వారికి టికెట్ ఇవ్వాలంటే అది కూడా తమ అనుచరులకే ఇవ్వాలని సూచనలు చేస్తుండడంతో పార్టీ నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఖమ్మం కాంగ్రెస్ టికెట్ కోసం మంత్రుల సంబంధీకులతో పాటు ఇతర ఆశావహుల జాబితా కకూడా రోజురోజుకూ పెరుగుతోంది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఆదినుంచి కమ్మ సామాజికవర్గానికి చెందినవారే ఎక్కువగా మంది గెలిచారు. ఇక్కడ ఆ సామాజికవర్గం ఓటుబ్యాంకు కీలకంగా ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఆ సామాజికవర్గమే కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆచితూచి టికెట్ కేటాయింపులో అడుగులు వేస్తోంది. ఖమ్మం టికెట్ ఆశిస్తున్న వారిలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్, కొత్తగూడెం చెందిన బీసీ వర్గం నేత నాగసీతారాములు, గ్రానైట్ వ్యాపారవేత్త కాంగ్రెస్‌నేత రాయల నాగేశ్వరరావు ఉండగా రాయల నాగేశ్వరరావుకు ఇటీవల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడంతో ఆయన టికెట్ రేసు నుంచి తప్పుకున్నారు.

కాగా దరఖాస్తు చేసుకోకపోయినా మరికొందరు కూడా కాంగ్రెస్ టికెట్ రేసులో ఉన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దగ్గరి బంధువు రామసహాయం రఘురామిరెడ్డి, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్‌తో పాటు పలువురు పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. కాగా దివంగత నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం కలవడంతో జిల్లా రాజకీయాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే ప్రత్యామ్నాయంగా మాజీ ఎంపీ కాంగ్రెస్ సీనియర్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురామిరెడ్డి పేరు చర్చలో ఉండగా తాజాగా నందమూరి సుహాసిని పేరు కూడా ప్రచారం సాగుతోంది. దీంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుందో జిల్లా నేతలు కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, సీపీఐ కూటమి విజయం సాధించగా ఈ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్‌కు 2,66,162 ఓట్ల ఆధిక్యం లభించింది. దాంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుంటే గెలుపు సులభమన్న భావన ఆశావహుల్లో ఉంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి 17సార్లు ఎన్నికలు జరిగితే 11సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో ఖమ్మం కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచింది.

గత లోక్‌సభ ఎన్నికల తరుణంలో కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరడంతో ఆ ఎన్నికల్లో పార్టీ కేడర్ లేక ఓటమి చూడాల్సి వచ్చింది. ఈసారి కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు కాంగ్రెస్ చేతిలో ఉండడంతో ఒకటి మిత్ర పక్షం సీపీఐ చేతిలో ఉండడం, ముగ్గురు మంత్రులు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఖమ్మం టికెట్ కాంగ్రెస్‌కు హాట్‌సీటుగా మారింది. ఈ నేపథ్యంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది.

రేసు గుర్రాలు...

- పొంగులేటి ప్రసాదరెడ్డి
- తుమ్మల యుగంధర్
- మల్లు నందిని
- వి.హనుమంతరావు
- పోట్ల నాగేశ్వరరావు
- వంకాయలపాటి రాజేంద్రప్రసాద్
- జట్టి కుసుమకుమార్
- నాగసీతారాములు
- రామసహాయం రఘురామిరెడ్డి
- మానుకొండ రాధాకిషోర్
- నందమూరి సుహాసిని

రిజిస్ట్రేషన్లలో నిబంధనల ఉల్లంఘన



- వైరా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కరుణపై వేటు
- 1/70 చట్టం భూముల విషయంలో అక్రమాలు
- గతంలోనూ రెండుసార్లు సస్పెండైన కరుణ

వైరా, మార్చి 30: నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన వ్యవహారంలో ఖమ్మం జిల్లా వైరా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కరుణపై వేటు పడింది. ఆమెకు సహకరించిన అటెండర్ కృష్ణను కూడా బదిలీ చేశారు. ఏన్కూరు మండలంలో 1/70 యాక్టు ఉన్నప్పటికీ పార్టీషన్ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే ఫిర్యాదులు రావడంతో జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఆమెను వైరా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో ఖమ్మంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌ని వైరా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న కరుణను నాలుగు నెలల క్రితం వైరా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆమె బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఏన్కూరు మండలంలో 1/70 చట్టం అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ కుటుంబసభ్యుల పేర్లతో పార్టీషన్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ప్రైవేట్ బ్యాంకులకు చెందిన పలువురు ఏజెంట్ల మధ్యవర్తిత్వంతో.. కొంతమంది డాక్యుమెంట్ రైటర్ల సహకారంతో 200కు పైగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.

అలాగే వైరా, కొణిజర్ల మండలాల్లో లేఅవుట్ లేని స్థలాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గిఫ్ట్ రిజిస్ట్రేషన్ల పేరిట కూడా నిబంధనలకు తూట్లు పొడిచారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండి కొట్టినట్లు, పెద్దఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ కరుణను జిల్లా రిజిస్ట్రార్ ప్రశ్నించి రికార్డులు పరిశీలించారు. అక్రమాలకు ఆధారాలు లభ్యం కావడంతో ఆమెను వైరా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల నుంచి తొలగించారు. కాగా, రిజిస్ట్రేషన్లలో నిబంధనలకు ఉల్లంఘనకు సంబంధించి కరుణ గతంలో కూడా రెండుసార్లు సస్పెండైనట్లు తెలిసింది.

ప్రతీ నెల 15 వరకే రేషన్ బియ్యం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి30: జిల్లాలో ఆహార భద్రత కార్డు లబ్ధిదారులు ప్రతీ నెలా 1నుంచి 15వ తేదీలోగానే రేషన్‌బియ్యం, సరుకులను డీలర్ల నుంచి తీసుకెళ్లాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపా రు. పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని జిల్లాలోని కార్డుదారులకు ఉచితంగా 15వ తేదీ వరకు మాత్రమే పంపిణీ చేయడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. లబ్ధిదారులు ఈ సమయంలోనే సరుకులు తీసుకోవాలని ఆయన కోరారు. ఖమ్మం జిల్లాలో 4,11,283ఆహారభద్రతా కార్డులు, అన్నపూర్ణ అంత్యోదయ కార్డులు ఉన్నాయని, వీటికిగాను 7,280,271 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఆహార భద్రత కార్డుదారులకు ఏప్రిల్ 15లోగా పీడీఎస్ బియ్యాన్ని చౌక ధరల దుకాణాలలో పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌వో తెలిపారు.

హెచ్‌ఎంపై పోక్సో కేసు

మధిరరూరల్, మార్చి 30: మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సాధు సమాధానం(52)పై పోక్సో కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ ఎస్ఐ సంధ్య శనివారం రాత్రి తెలిపారు. హెచ్‌ఎం సాధు సమాధానం9,10వతరగతికి చెందిన నలుగురు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వారి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై పలు పత్రికల్లోనూ, సోషల్‌మీడియాలోనూ వార్తలు రావడంతో పోలీసులు స్పందించి శనివారం మడుపల్లి పాఠశాలకు వెళ్లి విద్యార్థినులను రహస్యంగా విచారించారు. ఈ సందర్భంగా రాతపూర్వకంగా విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సాధు సమాధానంపై కేసు నమోదు చేశారు.

రూ. 23.73లక్షల పట్టివేత

ఖమ్మం క్రైం/ భద్రాచలం, మార్చి 30: ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి పత్రాలు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తులవద్ద నుంచి 23.73లక్షలను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో పోలీసులు, ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు గ్రామానికి చెందిన సునావత్ కిరణ్ రూ.85వేలు, జహీర్‌పురకు చెందిన కూరపాటి వెంకటేశ్వర్లు రూ.8 లక్షల నగదును వారి ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తుండగా తనిఖీల్లో ఉన్న పోలీసులు వారిని పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం కూనవరం రోడ్డులో చెక్ పోస్ట్ వద్ద రూ.7,23,400లను తనిఖీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



ముగిసిన టెన్త్ పరీక్షలు

- ఆనందంతో కేరింతలు కొట్టిన విద్యార్థులు
- తల్లిదండ్రులతో కలిసి హాస్టళ్లనుంచి ఇంటిబాట

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 30: పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారంతో ముగిశాయి. సోమవారం, మంగళవారం ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రధాన పరీక్షలు ముగియటంతో విద్యార్థులు ఆనందోత్సవాలతో కేరింతలు కొడుతూ పాఠశాలలకు బైబై చెబుతూ ఇంటి బాట పట్టారు. ఖమ్మం జిల్లాలో శనివారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 16,577మంది విద్యార్థులకుగాను 16,534 మంది పరీక్షలకు హాజరయ్యారు. 43మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. పరీక్షలు ముగియటంతో పాఠశాలలు, పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లితండ్రులతో కోలాహలం నెలకొంది. గురుకులాలు, ప్రైవేటు పాఠశాలల హాస్టల్స్‌లోని విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

భద్రాద్రి జిల్లాలో..

భద్రాద్రి జిల్లాలో పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 303పాఠశాలల నుంచి 12,341 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 5,900 మంది బాలురు, 6,441 మంది బాలికలు ఉన్నారు. 667మంది ప్రవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు తెలుగు పరీక్ష రోజు పాల్వంచలోని కేటీపీఎస్ ఉన్నత పాఠశాలలో ఓ పరీక్ష గదిలో విద్యార్థులకు మెయిన్ జవాబు పత్రాలు ఇవ్వకుండా పరీక్ష రాయించడం, 28న జీవ శాస్త్రం పరీక్ష రోజు గుండాల మండలం కాచనపల్లి ఏజీహెచ్ఎస్ పాఠశాలలో పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని చీఫ్ సూపరింటిండెంట్, డిపార్టుమెంట్ అధికారులను పరీక్ష విధుల నుంచి తొలిగించిన ఘటనలు మినహా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు పరీక్షకు 12,341 మందికి గాను 12,289 మంది హాజరయ్యారు. 52మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు.



కరెంటు కాలం

- గిర్రున తిరుగుతున్న విద్యుత్ మీటర్లు
- వ్యవసాయం, గృహ, పరిశ్రమల్లో పెరిగిన వాడకం
- రోజుకు 7నుంచి 8 మి. యూనిట్ల వినియోగం
- గతేడాది కంటే పెరిగిన విద్యుత్ డిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 30: భానుడి భగ భగలకు విద్యుత్ మీటర్లు పరుగులు పెడుతున్నాయి. పగలు ఎండ తీవ్రత, రాత్రి ఉక్కపోతతో క్షణ కాలం పాటు కూడా నివాసాలు, పరిశ్రమాలు, వ్యాపార కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ మీటర్లు ఆగని పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వ్యవసాయ విద్యుత్ వాడకంతో పాటుగా గృహ, పరిశ్రమల విద్యుత్ వినియోగం కూడా నమోదు జరుగుతోంది. గత మార్చి నెల కంటే ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఇప్పటికే ఎక్కువగా ఉండటంతో జిల్లా వ్యాప్తంగా ఖమ్మం విద్యుత్ సర్కిల్‌లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. అయినా విద్యుత్ సమస్యలు ఎక్కడా రాకుండా టీఎస్ఎన్పీడీసీఎల్ అధికారులు అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ ముందుకు వెళ్తున్నారు.

రీడింగ్ రైజింగ్..

పెరుగుతున్న విద్యుత్ వినియోగంతో పాటుగా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మార్చి నెల నుంచే విద్యుత్ వినియోగం పెరుగుతోంది. 2022కంటే 2023లో విద్యుత్ వినియోగం పెరిగింది. 2023కంటే అత్యధికంగా 2024లో విద్యుత్ రీడింగ్ నమోదవనుంది. విద్యుత్‌శాఖ అంచనాలకు మించిన స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతోంది. 2023మార్చి 1నుంచి 30వరకు 194మిలియన్ యూనిట్ల వాడకం జరగటంతో 2024 మార్చి 1నుంచి 30వరకు 198 మిలియన్ యూనిట్ల వాడకానికి కార్యాచరణ చేశారు. కాని వినియోగం మాత్రం శనివారం నాటికి 211 మిలియన్ యూనిట్లకు చేరింది. మార్చి 1నుంచి 10వ తేదీ వరకు ఉదయం 8గంటల సమయంలో గరిష్ఠంగా రోజుకు 7మిలియన్ యూనిట్ల విద్యుత్ గరిష్ఠంగా నమోదైంది.

వ్యవసాయ విద్యుత్ మోటర్లతో పాటుగా గృహ వినియోగం అదే సమయంలో నమోదు కావటంతో ఎక్కువ విద్యుత్ నమోదు జరిగినట్లు విద్యుత్‌శాఖ అధికారులు గుర్తించారు. 11వ తేదీ నుంచి 20వ వరకు మధ్యాహ్నం నుంచి రాత్రి 8గంటల వరకు అత్యధికంగా విద్యుత్ వినియోగం 7.5మిలియన్ యూనిట్లు నమోదైంది. ఎండల తీవ్రత పెరగటంతో గృహ వినియోగదారులు మధ్యాహ్నం సమయంలో ఏసీలు, కూలర్లు వంటి పరికరాలు వాడకంతో విద్యుత్ వినియోగం పెరిగింది. 21నుంచి 30వ తేదీ వరకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ వినియోగం పెరిగింది. పెరిగిన ఉక్కపోత కారణంగా గృహ వినియోగదారులు విద్యుత్ పెరగటంతో రోజుకు 8మిలియన్ యూనిట్లకు పెరిగింది.

8 మిలియన్ యూనిట్లు పెరిగినా ఇబ్బంది లేదు

సురేందర్, ఎస్ఈ, టీఎస్ఎన్పీడీసీఎల్

జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా కార్యాచరణ చేశాం. త్వరలో ముదిగొండ మండలం పమ్మిలో 130కేవీ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రానుంది. విద్యుత్ డిమాండ్ మేరకు ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా వ్యవసాయ, గృహ, పరిశ్రమల విద్యుత్‌ను అందజేస్తున్నాం.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

● నోడల్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 30: ఎన్నికల నోడల్ అధికారులు, తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిలో ఓటు హక్కు ఇతర నియోజకవర్గాల్లో ఉంటే, తమ ఓటును ఫారం-8 ద్వారా మార్చుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ అనుమతుల కోసం దరఖాస్తులు సువిధలో 48 గంటల ముందుగా సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. అన్ని ఏఆర్ఓ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ లో అనుమతులకోసం సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎం ల రవాణాకు అవసరం మేరకు 5 డీజీటీ వాహనాలు సిద్ధం చేయాలన్నారు. సెగ్మెంట్ల పరిధిలో స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేయాలన్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద బందోబస్తు ప్రణాళిక చేయాలన్నారు.

అక్రమ నగదు, మద్యం, ప్రలోభాల జప్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సామాగ్రి సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సామగ్రిలో వెల్ ఫెర్ కిట్ కూడా ఇవ్వాలన్నారు. వచ్చే వారం అంతరాష్ట్ర సమన్వయ సమావేశం చేపట్టనున్నట్లు, ఆ సమావేశానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాల్లో పిఏ సిస్టం అమర్చాలన్నారు. ఎన్నికల్లో వాడే బస్సులకు జిపిఎస్ పరికరాల అమర్పులను పూర్తి చేయాలన్నారు. బఫర్ బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ఫిర్యాదుల విభాగానికి ఫిర్యాదులు వచ్చేలా సి-విజిల్, 1950 నెంబర్లపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు.

ఎస్‌హెచ్‌వోలు యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి సి-విజిల్ డౌన్లోడ్ లు చేయించాలని, యువతలో చైతన్యం తేవాలని అన్నారు. సువిధలో అనుమతుల విషయమై రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు. 5మహిళా, దివ్యాంగ, యూత్ ఒక్కోటి చొప్పున ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియా పై నిఘా పెట్టాలని, ఎన్నికల సంబంధ వదంతులపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు.

రూట్ మ్యాపులు, డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్ లే అవుట్ల సిద్ధం చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ పూర్తి చేయాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణా ఐపీఎస్ మౌనిక, అదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా, బెల్లం పానకం అమ్మితే చర్యలు

చుంచుపల్లి, మార్చి30: నాటు సారా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు భద్రాద్రి జిల్లా అబ్కారీ అధికారి జానయ్య తెలిపారు. శనివారం కొత్తగూడెం పోలీస్ డివిజన్‌లోని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ బృందంతో కలిసి అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రుద్రంపూర్ తండా, రామవరం, చుంచుపల్లితండా, సర్వారం, కాకర్ల మొదలగు ప్రాంతాల్లో 12 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొని, నాటు సారాయి తయారీకి ఉపయోగించే 1000 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆదేవిధంగా పాల్వంచ స్టేషన్ బృందం వేరే ప్రాంతంలో దాడులు చేసి 5 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాయాపూరు పెద్దచెరువు సర్వే

కల్లూరు, మార్చి 30: మండలంలోని పాయాపూరు పెద్దచెరువు పరిధిలో శనివారం రెవె న్యూ, జలవనరుల శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ చెరువు పరిధిలో గల మునక భూమితో పాటుగా శిఖం భూమిని పలువురు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించటమే కాకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా పలువురు పొందారు. ఈ విషయమై శుక్రవారం చెరువు శిఖం భూమి ఆక్రమణ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించారు. సదరు చెరువు ప్రదేశంపై సమగ్రంగా సర్వే చేసి నివేదిక అందించాలని మం డల రెవెన్యూ అధికారులకు ఆదేశించటంతో వారు సమగ్ర సర్వే చేపట్టారు. జలవనరులశాఖ డీఈ రత్నాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్టాలిన్, సర్వేయర్ ఆశోక్‌లు సర్వే చేశారు. ముందుగా చెరువు విస్తీర్ణాన్ని అంచనా వేసి హద్దులు నిర్ణయించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న అధికారులు

అడ్డుకట్ట పడేనా..?

కేవలం డబ్బుకోసం కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు మానవత్వాన్ని మంటకలుపుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు చివరకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, ఆడపిల్లని చెప్పి అబార్షన్లు చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. ఏళ్ల తరబడి సాగిన ఈ వ్యవహారం కోవిడ్ నేపథ్యంలో తెర మరుగైన తాజాగా ఖమ్మం జిల్లా కేంద్రంలో మళ్లీ జడలు విరబోసుకొంటోంది. జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారించి ఇలాంటి అనైతిక కార్యక్రమాలకు చెక్ పెట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

- ఖమ్మంలో ఆగని లింగ నిర్ధారణ పరీక్షలు
- ఆడపిల్లని తేలితే అబార్షన్ చేస్తున్న కొందరు ప్రైవేట్ వైద్యసిబ్బంది
- చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్



ఖమ్మం కలెక్టరేట్, మార్చి30: కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు మానవత్వాన్ని వీడి కేవలం డబ్బుకోసం పనులకు ఒడిగడుతున్నారు.... కొందరి అమాయకత్వం... మధ్యవర్తుల ప్రమేయంతో కడుపులో ఉన్నది ఆడపిల్లంటే ఆ తల్లితండ్రులు కడుపులోనే కరగదీస్తున్నారు.. అందుకు కాసులకు కక్కుర్తి పడే ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యాలు సహకరిస్తున్నాయి. ఆసుపత్రికి రోగి వస్తే అనవసరమైన పరీక్షలు చేసి, అవసరం లేకున్నా శస్త్ర చికిత్సలు చేస్తూ లక్షలాది రూపాయలను కాజేసే ప్రైవేట్ ఆసుపత్రులు చివరకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, ఆడపిల్లని చెప్పి అబార్షన్లు చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. ఏళ్ల తరబడి సాగిన ఈ వ్యవహారం కోవిడ్ నేపథ్యంలో తెరమరుగై తాజాగా మళ్లీ జడలు విరబోసుకొంటోంది. లింగ నిర్ధారణకు రూ.5,500లు, అబార్షన్‌కు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నారు. చివరకు అబార్షన్ చేయలేని పరిస్థితి ఉంటే పుట్టిన ఆడపిల్లను అమ్ముతామని నిస్సిగ్గుగా చేప్పే కొందరు వైద్యులు కూడా ఇక్కడ ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించొచ్చు.

ఖమ్మం జిల్లాలో ప్రతి ఏడాది 25 వేల కాన్పులు జరుగుతున్నాయి. గర్భవతులు తమకు పుట్టబోయేది ఆడపిల్ల, మగపిల్ల అని లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. గతంలో మయూరి సెంటర్‌లో ప్రైవేటు ఆస్పత్రిని నిర్వహించిన ఓ నిర్వాహకుడు ఖమ్మంలోనే గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహించి అప్పట్లో పట్టుబడ్డాడు. తాజాగా వైరా రోడ్డు సమీపంలోని చర్చికి ఎదురుగా ఉన్న వీధిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అబార్షన్లు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఇవే కాకుండా కొందరు ఇళ్లలో గుట్టుచప్పుడు కాకుండా మొబైల్ స్కానింగ్ యంత్రాలను తీసుకెళ్లి అక్కడికక్కడే లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆడపిల్ల అని తేలితే అబార్షన్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై కూడా వైద్యశాఖ అధికారులకు తెలిసినా మాకెందుకు అన్న ట్లు ఊరకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖమ్మం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లకు చెందిన కొందరు గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తూ అక్రమాలకు తెరలేపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలను ఆకట్టుకుంటూ వారికి నజరానాలిస్తూ తమ వద్దకే వచ్చే విధంగా పక్కా ప్రణాళికలతో ఈ తతంగాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. కోవిడ్ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ పరిణామాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు నిరాటంకంగా లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నారు. చర్చికాంపౌండ్ సమీపంలో గత గురువారం రాత్రి దాడిచేసిన ప్రైవేటు ఆస్పత్రిలో ఓ మహిళా వైద్యురాలు లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తూ అబార్షన్ చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆస్పత్రిలో కేషీట్ల ఆధారంగా సుమారు 50 వరకు అబార్షన్లు చేసినట్లు వైద్యఅధికారుల పరిశీలనలో తేలింది. ఒక్కొక్కరికి ఒక్కో రకమైన చికిత్సల పేరుతో రప్పించి వారికి వైద్యం అందిస్తున్నట్లు చెబుతూ గర్భస్రావానికి ఒడిగడుతున్నారు. గురువారం ఒక్కరోజే 7 గురు మహిళలు ఈ ఆస్పత్రిని సందర్శించి 5గురికి అబార్షన్లు చేయగా మరో ఇద్దరికి చేయడానికి సిద్ధం చేశారు. ఈ తతంగం అధికారుల దాడుల్లో స్పష్టం అయ్యింది. అయితే ఇలాంటి స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై నిఘా ఉంచాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం వారిచ్చే మామూళ్లకు అలవాటు పడ్డారని విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ఖమ్మంలో పనిచేసిన డీఎంహెచ్‌వో స్ట్రింగ్ ఆపరేషన్ చేసి పలు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై దాడులు నిర్వహించి వాటిపై చర్యలు తీసుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో అనైతికంగా లింగ నిర్ధారణ చేస్తున్న విషయంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారించి ఇలాంటి అనైతిక కార్యక్రమాలకు చెక్ పెట్టాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

గర్భస్రావాలకు అడ్డుకట్ట వేయలేరా..?

జిల్లాలో గర్భస్రావాల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపట్టలేదా. (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) ఎంటీపీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తేనే ఇలాంటి అకృత్యాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. వైద్యఆరోగ్యశాఖ నుంచి అనుమతి పొందిన వైద్యులు మాత్రమే ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని గర్భస్రావాలు చేయడానికి చట్టం వీలు కల్పిస్తోంది.

జిల్లాలో ప్రైవేటు మహిళా వైద్యులకు కొదవేం లేదు. మొత్తంగా 380 ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, ఉన్నాయి. వీటిలో గైనకాలజిస్టులు59 మంది ఉన్నారు. వీటిలో మమత ఆస్పత్రి, అంకుర, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తప్ప ఎవ్వరికీ ఎంటీపీ అనుమతులు లేవు. కానీ అన్నిప్రైవేటు ఆస్పత్రిల్లో ఎంటీపీ చట్టాన్ని వైద్యులు విస్మరిస్తు గర్భస్రావాలను ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. వాస్తవానికి ఎంబీబీఎస్ వైద్యులు గర్భస్రావాలు చేసేందుకు అనర్హులు. స్త్రీ వైద్యంలో ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారే అర్హులు. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తే. ప్రతి నెల ఎన్ని గర్భస్రావాలు చేశారనే సమాచారం కూడా వైద్యశాఖకు అందించాల్సి ఉంటుంది.

లింగనిర్ధారణ చేస్తే చర్యలు తీసుకుంటాం

● డాక్టర్ మాలతి,
జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి



జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మా దృషికి వస్తే, ఒకవేళ ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిసే తీవ్ర చర్యలుంటాయి. జిల్లాలో వస్తున్న ఆరోపణలపై దృష్టిసారించి విచారిస్తాం. ఎక్కడైనా నిర్వహిస్తోన్నట్లు తెలిస్తే సమాచారాన్ని అందించాలి. ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడే వారిపై ఖఠిన చర్యలు తీసుకుంటాం. ఎంటీపీ చట్టాన్ని కూడా పూర్తి స్థాయిలో అమలుచేస్తాం. గైనకాలజిస్టులతో సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించి అనుమతులున్న వారికి మాత్రమే చేసేలా చర్యలు తీసుకుంటాం.

పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

• వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు, పోలింగ్ నాడు అత్యవసర సేవలు నిర్వహించే అర్హులైన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్‌లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రతి జిల్లాలో ఉద్యోగుల నుంచి ఫారం 12 తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించాల సూచించారు. ఏప్రిల్ 29 నాటికి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు సమర్పించాల్సి ఉంటుందని, ఫారం 7ఏ ను సీఈఓ కార్యాలయం ధ్రువీకరించిన తర్వాత ఏప్రిల్ 30 నుంచి మే 1 2024 వరకు రిటర్నింగ్ అధికారి స్థాయిలో పోస్టల్ బ్యాలెట్ లను ప్రింట్ చేయాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో మే 3న, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరించాలని తెలిపారు. ఏప్రిల్ 23 లోపు ఫారం 12డి సమర్పించాలని, సదరు దరఖాస్తులను పరిశీలించి రిటర్నింగ్ అధికారి ఏప్రిల్ 24 నాడు ఆమోదించిన దరఖాస్తులకు సమాచారం అందిస్తారని తెలిపారు. 85 సంవత్సరాల పైబడి పూర్తిగా సీనియర్ సిటిజెన్లకు, కోవిడ్ పేషెంట్లుకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. ఏప్రిల్ 23 లోపు ఫారం 12డి సమర్పించాలని అన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, డీఆర్డీఓ సన్యాసయ్య, జడ్పి సీఈవో వినోద్, ఆర్డీఓ గణేష్, ఎస్డీసీ రాజేశ్వరి, డీఈ వో సోమశేఖర శర్మ, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, రాంబాబు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్


గౌతమ్‌ను అభినందిస్తున్న సునిల్‌రెడ్డి,

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో గౌతమ్‌కు కాంస్య పతకం

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 30: పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన అల్లూరి గౌతమ్ ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించాడు. పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గౌతమ్ 4 100 మీటర్ల ఓపెన్ రీలే పోటీలో తృతియ స్థానంలో నిలిచి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపిన గౌతమ్‌ను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్‌లు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

బెల్టు దుకాణాలపై దాడులు

● రూ.45వేల మద్యం స్వాధీనం
● ముగ్గురిపై కేసు నమోదు


పట్టుకున్న మద్యం సీసాలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 30: ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో బెల్టుషాపులపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, అబ్కారీ శాఖ అధికారులు దాడులను ముమ్మరం చేశారు. మండలంలోని నారంవారిగూడెం కాలనీ, వినాయకపురం గ్రామంలో శనివారం అధికారులు సంయుక్తంగా దాడులు జరిపారు. ఎన్నికల అధికారి కృష్ణ, అబ్కారీ ఎస్ఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు జరిపారు. రెండు గ్రామాల్లో మూడు బెల్టుషాపుల్లో 231 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.45వేలకు పైగానే ఉంటుంది. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ

ముదిగొండ, మార్చి 30: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో ఓ గ్రానైట్ ప్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురి సెల్‌ఫోన్లను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. అర్ధరాత్రి కార్మికులు నిద్రిస్తుండగా దుండగుడుసెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లిన విషయం సీసీ కెమెరాల్లో బహిర్గతమైంది.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన

అశ్వారావుపేట, మార్చి 30: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోని వ్యవసాయ క్షేత్రాలను ఏపీలోని వినన్నపేటకు చెందిన బీఎస్సీ బోటనీ విద్యార్థులు సందర్శించారు. కళాశాలలోని వ్యవసాయ క్షేత్రాల్లో బొప్పాయి, పుచ్చ, వంగ, చెరుకు పంటలను సాగు చేసే విధానాన్ని వివరించారు. తేనెటీగల పెంపకం, కొబ్బరి, మామిడి తోటలు, యాజ మాన్య పద్ధతులు, క్యూఆర్ స్కానర్ ద్వారా వాటి వివరాలను, ఉపయోగాలను, వానపాముల తయారీ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు రాంప్రసాద్, లక్ష్మణ్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.


అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో క్షేత్రాలను సందర్శించిన వినన్నపేట విద్యార్థులు

మంత్రి రాజనర్సింహను కలిసిన
వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 30: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నివాసంలో ఎమ్మెల్యే కలిసి వైరాలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం గురించి ప్రస్తావించారు. మంత్రిని కాంగ్రెస్ కండువాతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కూడా మంత్రిని కలిశారు.

ఎన్నికలు బహిష్కరించాలని
మావోయిస్టుల కరపత్రాలు

దుమ్ముగూడెం మార్చి 30: బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని కోరుతూ సీపీఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరిట డబ్ల్యుఎల్ రేగుబల్లి ప్రధాన రహదారిపై శనివారం కరపత్రాలు వెలిశాయి. బ్రాహ్మణీయ హిందుత్వ బీజేపీ దానితో అంటకాగే పార్టీలన్నింటినీ తన్ని తరమాలంటూ పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు చేసే కాంగ్రెస్ పార్టీను, ఓట్లకోసం వచ్చే ఇతర పార్టీలన్నింటినీ నిలదీయండని పేర్కొన్నారు. ఈ కరపత్రాలు స్థానికంగా కలకలం రేపాయి.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి30: ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోన్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు-6, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు-13, అసిస్టెంట్ ప్రొఫెసర్-6, సీనియర్ రెసిడెంట్ పోస్టులు-18 ఉన్నట్లు తెలిపారు. పోస్టులను పూర్తిగా వాక్‌ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన ఎంపికచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్వ్యూలను ఏప్రిల్ 3న ఉదయం 10గంటలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వివరాలన్నీ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వెబ్సైట్ డబ్ల్యూ డబ్ల్యూ.డబ్ల్యూ. జీఎంసీ. ఖమ్మం. జిల్లా వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ:ఖమ్మం.తెలంగాణ.. జీవోవి.ఇన్‌లో పొందు పరిచినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ నేతృత్వంలో ఎంపిక చేసి నియామకపు పత్రాలను అందచేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎంఎల్ పార్టీ నేత యాదన్న మృతి



ఇల్లందు మార్చి 30: సీపీఐ ఎంఎల్ విప్లవపార్టీల నాయకుడు యాదన్న అలియాస్ గండి యాదగిరి(65) శనివారం ఇల్లెందులో అనారోగ్యంతో మృతి చెందాడు. ఇల్లెందు మండలం, మానిక్యారం గ్రామానికి చెందిన యాదన్న ఆదివాసీల హక్కుల కోసం ఏజెన్సీ ప్రాంతాల ప్రజల కోసం, పోడు భూముల పట్టాల కోసం అనేక పోరాటాలు సాధించారు. అయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.

నిధుల డ్రా, ఖర్చుకు..
ఒక్కరోజే సమయం..

- వరుస సెలవులతో ఖాతాల్లోనే నగదు
- ఈనెల 21న స్కూళ్ల ఖాతాలకు గ్రాంటు
- 31లోగా వినియోగించకుంటే వెనక్కే...

మధిర, మార్చి 30: ఆర్థిక సంవత్సరం చివరి వారంలో పాఠశాలలకు నిధులు రావడంతో డ్రా చేయడం కష్టంగా మారింది. ఈనెల 21వ తేదీన పలు గ్రాంట్లు మంజూరయ్యాయి. అయితే 24, 25, 29వ తేదీల్లో బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు నిధులను డ్రా చేయలేకపోయారు. గడిచిన రోజులు పక్కన పెడితే మిగిలిన ఒక్క రోజు 31వ తేదీ ఆదివారం కావడం శరాఘాతమైంది. అదీగాక ఫైనాన్షియల్ ఇయర్ చివరి రోజు కావడం గమనార్హం.

చివరి వారంలో నిధులు..

పాఠశాలలకు సాధారణంగా రెండు విడుతలలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. పాఠశాలలు ప్రారంభ సమయం జూలైలో 50శాతం నిధులు వచ్చాయి. మిగిలిన 50 శాతం ఆర్థిక సంవత్సరం మరో వారంలో ముగుస్తుందనా ఈనెల 21వ తేదీన వచ్చాయి. ఎంఈవో కార్యాలయాలకు, క్లస్టర్ పాఠశాలల సముదాయాల నిర్వహణ నిధులు కూడా ఇదే తీరుగ వచ్చాయి. ఇలా వచ్చిన నిధులు ఆయా పాఠశాలలు, విద్యాశాఖాధికారుల బ్యాంక్ అకౌంట్లలో జమ అయ్యాయి. ఈ నిధులను మార్చి 31లోపు ఖర్చుచేయాలి.. లేకుంటే వెనక్కి వెళ్తాయి.

ఎంఆర్సీలు, సీఆర్సీలకు నిధులు:

ఖమ్మం జిల్లాలో 1,176 ప్రభుత్వ పాఠశాలు, వీటి పర్యవేక్షణ కోసం ఎంఆర్సీలు, సీఆర్‌సీలు ఉన్నాయి. వీటికి ఏడాది ప్రారంభంలో, లేదా మధ్యలో నిధులు రావాల్సి ఉంది. కానీ విద్యాసంవత్సరంతో పాటు ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో ఎంఆర్సీకి రూ.74వేలు, సీఆర్సీకి రూ.29వేలు చొప్పున నిధులు వచ్చాయి. పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. ప్రాథమిక పాఠశాలకు కనీసం రూ.15వేలు, యూపీఎస్‌కు రూ.25వేలు, హైస్కూల్‌కు రూ.50వేలు చొప్పున మంజూరయ్యాయి. ఇవే కాకుండా క్రీడలకు రూ.5 వేల నుంచి రూ.10వేలు, యూనిఫాం టైలరింగ్‌కు ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున నిధులు వచ్చాయి. ఈ నిధులను పాఠశాలల స్టేషనరీ ఖర్చులు, మరమ్మతులు, రంగులు వేయడం, సైన్సు ప్రయోగాలు, క్రీడలకు ఉపయోగించాలి. గతంలో ఈ నిధులను హెచ్‌ఎం, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కలిసి డ్రాచేసేవారు. ప్రస్తుతం ఈ కమిటీలు రద్దయ్యాయి. దీంతో హెచ్ఎంతోపాటు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చారు.


వీరిద్దరు కలిసి నిధులు డ్రాచేసి ఖర్చుచేయాల్సి ఉం ది.

బ్యాంకులకు వరుస సెలవులు...

ఈనెలలో బ్యాంకులకు వరుస సెలువులు రావడం కూడా ఇబ్బందిగా మారిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈనిధులు ఈనెల 21న గ్రాంట్ రూపంలో ప్రభుత్వం మంజూరు చేసింది. ఈలోపు కొత్తగా జాయింట్ చెక్ పవర్ కోసం సీనియర్ ఉపాధ్యాయుడి సంతకం బ్యాంక్‌లో చేయాల్సి ఉంది. ఆ తర్వాత నిధులు జమఅయ్యాయి. 24,25,29తేదీలలో బ్యాంకులకు సెలవులు వచ్చాయి. 31 ఆదివారం సెలవు. ఆర్‌బీఐ ఆదివారం బ్యాంకులు పనిచేయాలని ఆదేశాలిచ్చినా ఏమేరకు ప్రయోజనం చేకూరుతుందో తెలియదు. ఈపరిస్థితిలో నిధులు మొత్తం డ్రాచేసి ఖర్చుచేయడం పెద్ద సమస్యగానే పేర్కొంటున్నారు. స్కూల్ గ్రాంట్ నిధులు డ్రాచేసేందుకు, ఖర్చుచేసేందుకు ఇంకా ఒక్కరోజుమాత్రమే సమయం ఉంది. దీంతో కొందరు తమ చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉంది. అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం మార్చి 31లోపు డ్రాచేసి ఖర్చు చేయాలని చెబుతున్నారు

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు ఊరట

● 483మంది బాధితులకు ఫోన్లు అందజేసిన ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, మార్చి30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు ఊరట కల్పించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రోహిత్‌రాజు ప్రత్యేక శ్రద్ధతో 483 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు శనివారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు 1674మంది పోలీసులకు ఫిర్యాదు చేయగా, 964 మొబైల్స్ సమాచారాన్ని రాబట్టి 483 ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఫోన్లను రికవరీ చేసేందుకు తీవ్రంగా శ్రమించిన కొత్తగూడెం త్రీటౌన్, మణుగూరు పోలీస్‌స్టేషన్లలో అధికంగా సెల్‌ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందజేసేందుకు శ్రమించిన కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌ను ఎస్పీ అభినందించారు. పోలీస్ సిబ్బంది అంకిత భావంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుపై విచారణ చేసి ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందజేస్తామని ఎస్పీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఐటీ సెల్ ఇన్‌చార్జి సీఐ నాగరాజు రెడ్డి, ఐటీ సెల్ సభ్యులు విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


సెల్‌ఫోన్లను అందిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

మెడికల్ కళాశాలకు మృతదేహం దానం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి30: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఓ వ్యక్తి మృతదేహాన్ని అప్పగించారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన ప్రముఖ టీవీఆర్టిస్ట్, సినీ కళాకారుడు దూదిపాళ్ల వీరభద్రం(72) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. జీవించి ఉన్నప్పుడే ఆయన మరణానంతరం నేత్రదానం, మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇచ్చేలా వీలునామా రాసుకున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు శనివారం ఆయన మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జ్యోతి అశోక్ కుమార్ మృతదేహాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల సంఘం బాధ్యులు మాదవరపు నాగేశ్వరరావు, అన్నంసేవా ట్రస్ట్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, అశోక్, కృష్ణ ప్రసాద్, బాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని వినతి

ఖమ్మం రూరల్, మార్చి30: పాలేరు నియోజకర్గంలోని నాలుగు మండలాల రైతుల విలువైన భూములకు నష్టం చేకూర్చే డోర్నకల్లు నుంచి గద్వాల రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. ఖమ్మంలోని ఎంపీ నివాసంలో రైతులు శనివారం కలిసి విన్నవించారు. ఎవరికి నష్టం కలగని రీతిలో రైతులంతా చర్చించి ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ సమగ్ర నివేదికను ఇస్తే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో పట్టాభిరెడ్డి, సయ్యద్ సాదిక్ అలీ, తోట రామారావు, ముత్యం ఉప్పలరావు, గుర్రం రాము, పండరి, రాజు, నల్లపునేని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుకు రాత పరీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మార్చి30: ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏఆర్టీ సెంటర్‌లో లాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి శనివారం రాత పరీక్ష నిర్వహించారు. ఒక్క పోస్టుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా, 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శనివారం డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాత పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 71 మంది హాజరుకాగా ప్రతిభ ఆధారంగా ఈ పోస్టును భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పాల్వంచలో
రెండు సైబర్ క్రైం కేసుల నమోదు

పాల్వంచ, మార్చి 30: పాల్వంచ పట్టణంలో పోలీసులు శనివారం రెండు సైబర్ క్రైం కేసులను నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన గోడా రాము కొంత కాలంగా పాల్వంచలో నివాసముంటున్నాడు. ఏటిగ్రాంలో ఆప్‌లో వచ్చిన లింక్ ద్వారా కాంజూ యాప్‌లో వీడియోలు, ప్రొడక్టులపై రివ్యూలు ఇవ్వడం మొదలెట్టాడు. మొదట్లో కొంత నగదు అతని ఖాతాలోకి జమయ్యాయి. కానీ వాటిని విత్‌డ్రా చేసుకోవాలంటే రూ.లక్షా ముప్పై వేలు జమచేయాలని మెసేజ్ రావడంతో, అదంతా బోగస్ అని తెలిసి సైబర్ క్రైం పోలీసులును ఆశ్రయించాడు. అప్పటికే వారి మాటలు నమ్మి రూ.42వేలు వారి ఖాతాల్లో జమచేశానని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అదే విధంగా పాల్వంచ పట్ట పరిధిలోని నెహ్రూనగర్‌కు చెందిన ఓ మహిళ చైన్ లింక్ యాప్‌తో సభ్యత్వం తీసుకుంది. డబ్బులు వస్తున్నాయని నమ్మింది. అదే విధంగా కొంత కాలం పాటు ఆమె అకౌంట్‌లోకి డబ్బులు చేరాయి. డబ్బులు వస్తున్నాయనే నమ్మకంతో ఆమె ఎక్కువ నగదు డిపాజిట్ చేయడం ప్రారంభించింది. ఈ క్రమంలోనే ఆమె రూ.నాలుగు లక్షల నలభై ఏడు వేల నగదును ట్రాన్స్‌ఫర్ చేసింది. అనంతరం మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పాల్వంచ పట్టణ పోలీసులు రెండు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్



(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే.! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

నిత్యకల్యాణంలో పాల్గొన్న 122 జంటలు



నిత్య కల్యాణంలో పాల్గొన్న జంటలు

భద్రాచలం, మార్చి 30: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం అర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే సంప్రదాయ బద్ధంగా స్వామివారి నిత్యకల్యాణం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనపూజ నిర్వహించారు. అనంతరం పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగళ్యదారణ, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. నిత్యకల్యాణంలో 122 జంటలు పాల్గొన్నాయి.

వెంకటేశుని కల్యాణానికి సర్వం సిద్ధం

పాల్వంచ టౌన్, మార్చి 30: పాల్వంచ పట్టణం శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి (గుట్ట)పై స్వయంభూగా వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేతుడైన వెంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణానికి భక్త సమాజ మండలి సర్వంసిద్ధం చేసింది. సుమారు 500 సంవత్సరాల క్రితం కొండపై వెలిసిన వెంకటేశ్వరస్వామి వారు గుట్టపైకి చేరేందుకు 1500పైగా మెట్లు ఎక్కి చేరాల్సి ఉంది. ఏప్రిల్ 4న జరగనున్న స్వామివారి కల్యాణంలో గుట్టపైన స్వామివారి కల్యాణం వీక్షించేందుకు సుమారు 25 వేలమంది వరకు భక్తులు హజరవుతారని అంచనా. గుట్టపైన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండ సుమారు 2 ఎకరాల ప్రాంగణంలో తాటాకు చలువపందిళ్లు, స్వామిని దర్శించేందుకు భక్తులకు క్యూ లైన్లు, యాగశాల ఏర్పాటు వంటి పనులు పూర్తి చేశారు. ఆలయ రాజగోపురానికి కొత్త రంగులు వేసి ముస్తాబు చేశారు. మొత్తంగా కల్యాణంలో ఉభయ జిల్లాల నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి కూడా సుమారు 40వేల నుంచి 50వేల మంది వరకు భక్తులు హజరవుతారు. గుట్టపైకి వెళ్లలేని భక్తులు పాదాల మండపం వద్ద వేంచేసియున్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గుట్టపై, కింద భక్తులకు తాగునీరు, షామియానాలు, చలువ పందిళ్లు వేసి ఆలయకమిటీ ఏర్పాట్లు పూర్తి చేసే క్రమంలో నిమగ్నమైంది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా మహిమాన్వితుడైన స్వామిగా ప్రసిద్ధి చెందిన గుట్టవెంకన్న ఎత్తైన గుట్టపై కొలువై ఉండి తెలంగాణ తిరుపతిగా బాసిల్లుతోంది. కల్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయన నిర్వాహణ కమిటీ సభ్యులు తెలిపారు.



క్యూలైన్లో భక్తులు వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు



కల్యాణం తిలకించేందుకు చలువ పందిళ్ల ఏర్పాటు



సిద్ధమైన యాగశాల

నృత్యాభిషేకం అనుమతి రద్దు

ఉత్తర్వులు జారీ చేసిన దేవస్థానం అధికారులు

భద్రాచలం, మార్చి 30: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రదేశంలో ఏప్రిల్ 15న భద్రాద్రి నృత్యాభిషేకం, స్వరాభిషేకం 2024 కార్యక్రమం నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేసినట్లు దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. గత సంవత్సరం అనుమతించిన విధంగా దేవస్థానం వైకుంఠ ద్వారం వద్ద నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వగా దేవస్థానం కల్యాణ మండపంలో, దేవస్థానం నిర్వహిస్తున్నట్లు అర్థం వచ్చేలా ఆహ్వాన పత్రికలు తయారు చేయించి దేవస్థానం కీర్తి ప్రతిష్టలకు భంగం వాటిల్లేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సదరు సంస్థకు దేవస్థానం ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తూ బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్టుకు ఈవో ఆదేశాల మేరకు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

మంటపెట్టిన మాటలు !

కరకగూడెంలో ఓ ఫంక్షన్‌హాల్ నిర్మాణం విషయంలో వివాదం

తహసీల్దార్ గురించి ఫోన్‌లో ఎంపీవో వ్యాఖ్యలు

సోషల్‌మీడియాలో లీకైన సంభాషణల ఆడియో

కరకగూడెం, మార్చి 30: ఓ ఫంక్షన్‌హాల్ నిర్మాణం విషయంలో ఓ ప్రభుత్వ అధికారి మరో అధికారి గురించి సదరు ఫంక్షన్‌హాల్ నిర్మాణదారుడితో ఫోన్‌లో చేసిన సంభాషణ వివాదాస్పదమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం ఎంపీవో కుమార్ అదే మండల తహసీల్దార్ నాగప్రసాద్ గురించి ఫోన్‌లో మాట్లాడిన ఆడియో లీక్ అవ్వడంతో ఈ వివాదం మొదలైంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. కరకగూడెం మండలానికి చెందిన బూరుగడ్డ రవి అనే వ్యక్తి మండల కేంద్రంలో సంవత్సరం క్రితం ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టాడు. అయితే ఫంక్షన్ హాల్ కడుతున్న స్థలం విషయంలో కుటుంబ తగాదాలు ఉండడంతో కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లడంతో ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని నిలిపేయాలని కోర్టు ఎంపీవో కార్యాలయానికి నోటీసులు పంపింది. దాంతో కొంతకాలం క్రితం పంచాయతీ అధికారులు సదరు ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని నిలిపేశారు. అయితే బూరుగడ్డ రవి తాను తన సొంత భూమిలోనే ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు కోర్టులో పిటీషన్ వేశానని ఇటీవల కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ సంప్రదించి ఫంక్షన్‌హాల్ నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీవో కుమార్ ఫంక్షన్‌హాల్ నిర్వాహకుడు రవికి ఫోన్ చేసి కోర్టు నోటీసులు ఇచ్చిన తరువాత కూడా నిర్మాణాన్ని ఎందుకు కొనసాగిస్తున్నావని ప్రశ్నించాడు. అయితే తాను తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చిన నిర్మాణం చేపడుతున్నానని చెప్పడంతో ఎంపీవో అసహనానికి లోనై పరుషమైన మాటలతో తహసీల్దార్‌పై దుర్భాషలాడాడు. ఈ క్రమంలోనే తనకు రూ.5లక్షలు ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నావని రవిని ఉద్దేశించి మాట్లాడాడు. ఈ ఫోన్ సంభాషణ శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వ్యవహారంపై ఎంపీవో కుమార్‌ను సంప్రదించగా తనకు తహసీల్దార్‌తో పరిచయం లేదని, తాను ఆయనను ఏమీ అనలేదని తెలిపాడు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న ఆడియోలో మాట్లాడింది తాను కాదని తెలిపాడు. ఇదే విషయంపై కరకగూడెం తహసీల్దార్‌ను వివరణ కోరగా ఈ వ్యవహారాన్ని తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపాడు. ఇందులో పాపం పుణ్యం అంతా ప్రజలు.. దేవుడే చూసుకుంటారన్నాడు. ఈ విషయం మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

సెంట్రల్‌ఫోర్స్ అధికారులతో సీపీ సమావేశం

బందోబస్తు, శాంతిభద్రతలపై సమీక్ష

ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చ

సీఐఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు సాదర స్వాగతం



అధికారులతో మాట్లాడుతున్న సీపీ సునీల్ దత్

ఖమ్మంక్రైం, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల బందోబస్తు, శాంతిభద్రతలపై సెంట్రల్ ఫోర్సు ఉన్నతాధికారులతో శనివారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సమావేశం నిర్వహించారు. ముందుగా సీపీ కార్యాలయానికి చేరుకున్న సీఐఎస్ఎఫ్ సౌత్‌జోన్ 2 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.నందన్‌ను పుష్పగుచ్ఛం అందించి సీపీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహంపై సెంట్రల్‌ఫోర్సు ఉన్నతాధికారులతో ప్రత్యేకగా భేటీ అయినట్టు సీపీ తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎన్నికల ముందు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించినట్టు ఆయన పేర్కొన్నారు. మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణ నియంత్రణ చర్యలు సరిహద్దు మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు పరస్పర సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణం కల్పిస్తూ బందోబస్తు విజయవంతం చేస్తామన్నారు. ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయని, రానున్న రోజుల్లో బలగాల సంఖ్య పెరుగుతుందని సీఐఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో కేసులు నమోదయిన వారు ప్రస్తుతం ఎక్కడున్నారు, వారి కదలికలపై దృష్టిసారించాలని, క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశామని తెలిపారు. తీరుమారకుండా వ్యవహరించే వారిపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. వారి పట్ల పటిష్ట నిఘా ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమాండెంట్ మనోజ్‌కుమార్ మౌర్య, డిప్యూటీ కమాండెంట్ మాల్కిట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి డబ్బులు ఎక్కడ..?

ఏడాది నుంచి బ్యాంక్ ఖాతాలో పడని డబ్బులు



ఆళ్లపల్లి, మార్చి 30: చెప్పుకుని మురవా.. చూసుకుని ఏడవడం అన్నట్టుగా ఉంది సీఎం సహాయనిధి చెక్కు తీసుకున్న ఓ అభాగ్యుడి ఆవేదన. వివరాల ప్రకారం.. ఆళ్లపల్లి మండలం, మర్కోడు పంచాయతీ, పెద్దూరు గ్రామానికి చెందిన కావటి పాపయ్యకు రెండేళ్ల క్రితం మెదడులో రక్తప్రసరణ జరగక, స్పృహ కోల్పోయాడు. దాంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స అందించారు. వైద్య ఖర్చులకు గాను ఆస్పత్రిలో సుమారు రూ.1.50 లక్షకు పైగా ఖర్చు కావడంతో, కుటుంబ సభ్యులు (మాజీ సీఎం కేసీఆర్ హయాంలో) సీఎం సహాయక నిధికి అర్జిపెట్టుకున్నాడు. దాంతో ప్రభుత్వం కావటి పాపయ్యకు రూ.16,000ల చెక్కు (చెక్కు నంబర్-612508)ఇవ్వడంతో, స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వారికి అందజేశారు. దాంతో పాపయ్య తన చెక్కును గుండాల మండలంలోని కాచనపల్లి ఎస్‌బీఐలో తన ఖాతాలోకి డిపాజిట్ చేశాడు. డబ్బుల కోసం వెళితే బ్యాంక్ సిబ్బంది ఏవేవో కొర్రీలు పెట్టారు. ఏడాది నుంచి డబ్బుల కోసం బ్యాంక్ చుట్టు చెప్పులు అరిగేలా తిరుతూ తన ఖాతాలో డబ్బులు పడటం లేదని ప్రతి సారి బ్యాంక్ అధికారులను ప్రశ్నించినప్పుడల్లా, పడతాయి అంటు దాటేస్తున్నారే తప్పితే తన ఖాతాలో డబ్బులు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇంతకు పాపయ్య చెక్కు బ్యాంక్ అధికారుల దగ్గరనే ఉందా..? లేక మరే కారణం చేతనైన చెక్ రిజక్ట్ అయినదా.. ఇప్పటే చెక్కు కాల పరిమితి కూడా పూర్తి అయినది, అదే జరిగితే ప్రభుత్వం మరో చెక్కును పాపయ్యకు పంపించేది కదా..? ఇటీవలే సోషల్ మీడియాల్లో సీఎం సహాయ నిధి డబ్బులు కాజేస్తున్నట్టు వస్తున్న ఆరోపన ల్లో చెక్కు సంగతేమిటి అనే సందేహాలు కలుగుతున్నాయి. అధికారులు తనకు సాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ఆటో డ్రైవర్ లతీఫ్‌కు పలువురి అభినందన

వైరా, మార్చి 30: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ లతీఫ్ వారంరోజులపాటు పదోతరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాడు. సిరిపురంలో పంక్చర్ షాపుతోపాటు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న లతీఫ్ తనవంతు బాధ్యతగా గర్భిణీ మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు పది పరీక్షలు రాసిన విద్యార్థినులకు ఉచిత ప్రయాణం కల్పించారు. వైరాకు 16కిలోమీటర్ల దూరంలో ఉన్న గరికపాడు హైస్కూల్లోని విద్యార్థినులను పది పరీక్షలకు ప్రతిరోజూ ఉదయం వైరా తీసుకువచ్చి పరీక్ష అనంతరం తిరిగి మళ్లీ వైరా నుంచి గరికపాడుకు పంపించారు. వారంరోజులపాటు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన లతీఫ్‌ను గరికపాడు ఉపాధ్యాయులు అభినందించారు. కృతజ్ఞతలు తెలిపారు.



ఆటోలో 'పది' విద్యార్థులను తీసుకెళుతున్న లతీఫ్



ఉపాధ్యాయులు, విద్యార్థులతో లతీఫ్

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

ఆదివారం 31 మార్చి 2024

పోలమాంబ జాతర ప్రారంభం

అశ్వారావుపేట రూరల్, మార్చి 30: మండలంలోని అచ్యుతాపురంలో గల పోలమాంబ ఆలయ 63వ జాతర మహోత్సవాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జాతర వేడుకలు జరగనున్నాయి. జాతర ఉత్సవాలు శనివారం ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అఖండ దీపారాధన, అష్టోత్తర పూజలతో పాటు రకరకాల పూజలను నిర్వహించారు. అమ్మవారిని అందంగా అలంకరించారు. ఐదు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవాలకు భక్తులు వేలాదిగా తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణను రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. జాతరకు భక్తులు అధికంగా తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

దోమెడ రహదారికి మోక్షం కలిగేనా..?

ఏళ్ల క్రితం ఆగిన రోడ్డు పనులు.. ప్రజల అవస్థలు

పట్టించుకోని పాలకులు, అధికారులు

కరకగూడెం, మార్చి 30: రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు మారినా.. పాలకులు, అధికారులు మారినా.. ఏజెన్సీలోని మారుమూల గ్రామలలో రహదారులకు మోక్షం కలగగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న సందంగామారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా జడ్పీ ఛైర్మన్ చందా లింగయ్య జడ్పీ నిధులు రూ.10లక్షలతో చిరుమళ్ళ, పోలకమ్మతోగు ఫారెస్టులోంచి ములుగు జిల్లా మంగపేట మండలం దోమెడ వరకు సుమారు 10కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణం కోసం 2004 సంవత్సరంలో శంఖుస్థాపన చేశారు. అనంతరం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్.. మండలంలోని పోలకమ్మతోగు గ్రామం నుంచి 5కిలోమీటర్ల వరకు రహదారి నిర్మాణ పనులు చేసి మధ్యలోనే రహదారి పనులు నిలిపివేశారు. దాంతో ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకునే పాలకులు, అధికారులు మాత్రం కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు.

రెండు జిల్లాల ప్రజలకు ఉపయోగం ఇలా..

మండల కేంద్రంలోని కరకగూడెం, చిరుమళ్ల, పోలకమ్మతోగు నుంచి ఆడవిలోంచి ములుగు జిల్లా మంగపేట మండలం దోమెడ బ్రహ్మణపల్లి చెక్ పోస్టు వరకు రహదారి నిర్మాణం పూర్తి అయితే ఆళ్లపల్లి, గుండాల, కరకగూడెం మండలాల ప్రజలకు ప్రయాణం సులభంగా ఉంటుంది. కరకగూడెం నుంచి బ్రహ్మణపల్లి చెక్ పోస్టు వరకు 14 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రహదారి నిర్మాణం లేక పోవడంతో.. కరకగూడెం నుంచి పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ వరకు 20కిలోమీటర్లు, ఏడూళ్ల బయ్యారం క్రాస్ నుంచి బ్రహ్మణపల్లి చెక్ పోస్టు వరకు 25కిలోమీటర్లతో 45కిలోమీటర్ల ప్రయాణం సాగించాలి. దొమెడ రహదారి నిర్మాణం పూర్తి అయితే సుమారు 31 కిలోమీటర్ల దూరం నుంచి ప్రజల సమస్యల తీరనుంది. దాంతో రెండు జిల్లాల ప్రజలకు ఉపయోగం ఉంటుంది. ఎన్నికల సమయంలో రహదారి నిర్మాణం పనులు చేపడతామని చెపుతున్న మాటలు హామీలకు పరిమితం అవుతుంది తప్ప ఈ రహదారికి మోక్షం రావడం లేదని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2018 సంవత్సరంలో ఎమ్మెల్యేగా ఉన్న పాయం వెంకటేశ్వర్లు, తరువాత ఎమ్మెల్యేగా గెలిచిన రేగా కాంతారావు త్వరలోనే టెండర్లను పిలిచి రహదారి నిర్మాణపనులు చేపడతామని హామీలు ఇవ్వడమే తప్ప పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యేగా గెలిచిన పాయం వెంకటేశ్వర్లు, అధికారులు స్పందించి దోమెడ రహదారి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దోమెడ నుంచి బైక్‌పై ప్రయాణిస్తున్న దృశ్యం


ప్రయాణం మధ్యలో సేదదీరుతున్న ప్రజలు

బాలిక వైద్యానికి రూ.2.20 లక్షలు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట, మార్చి 30: దమ్మపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సీసం రాంబాబు, వెంకటరమణ కుమార్తె గత మూడు సంవత్సరాలుగా బాలిక నరాల బలహీనతతో చూపు మందగించింది. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బాలికను హైద్రాబాద్ నిమ్స్ వైద్యశాలలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. బాలిక వైద్యానికి అవసరమైన డబ్బులను ప్రభుత్వం ద్వారా 2.20లక్షలు మంజూరు చేయించారు. బాలికను శనివారం హైద్రాబాద్ వైద్యశాలలో పరామర్శించి చెక్కును బాలిక తల్లితండ్రులకు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారేకు రాంబాబు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక రవాణాను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 30: ములకలపల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కలెక్టర్ ప్రియాంక అలాను లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశనాయక్ కోరారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాంతంలో ఐదు షెడ్యూల్‌లోని ములకలపల్లి మండలంలో ములకలపల్లి, తాళ్లపాయి, కొబ్బరిపాడు, మంగలిగుట్ట, పొగళ్లపల్లి, పూసుగూడెం, ఆనందపురం తదితర ప్రాంతాల్లో జోరుగా ఇసుక అక్రమంగా రవాణా జరుగుతుందని తెలిపారు. దీంతో లక్షల రూపాయలు అక్రమ ఇసుక రవాణా అవుతుందని, గ్రామాలన్నీ ఏజెన్సీ ఐదు షెడ్యూల్‌లో ఉన్నాయని లంబాడీలు ఆదివాసీలు, గిరిజనులకు ఇసుక క్వారీల ద్వారా ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. భద్రాచలం ఐటీడీఏ ద్వారా ములకలపల్లి మండలంలోని అన్ని గ్రామాలను గ్రామకమిటీ వేసి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్థానికంగా ఉన్న గిరిజన తండాలు, ఆదివాసీ గ్రామాలు కమిటీలు వేస్తే ఇసుక అక్రమ రవాణా జరగకుండ ఉంటుందని తెలిపారు. వినతిపత్రం అందచేసిన వారిలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షులు నాయక్, బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్య రవినాయక్ ఉన్నారు.

భద్రాద్రిలో మండుతున్న ఎండలు


నిర్మానుష్యంగా మారిన కూనవరం రోడ్డు

భద్రాచలం, మార్చి 30: మార్చి నెలలోనే భద్రాద్రిలో ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వచ్చేందుకు భద్రాద్రి వాసులు సాహసించడం లేదు. ఈ నెల 26న 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత ఉండగా 27న 38.4, 28న 40, 29న 39 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం నాడు ఈ సీజన్‌లోనే అత్యధికంగా 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం గమనార్హం. దీంతో సాయంత్రం 4.30 దాటినా ప్రధాన రహదారులు చాలా వరకు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

'కారుణ్య' దరఖాస్తులు పునరుద్ధరించండి

పాల్వంచ, మార్చి 30: కేటీపీఎస్‌లో కారుణ్య నియామకాల దరఖాస్తులను పునరుద్దరించాలని హెచ్-142 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామారావు జెన్కో అధికారులను కోరారు. శనివారం కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ఇరు కర్మాగారాల సీఈలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావులను యూనియన్ నాయకులు కలిశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో 2022 నుంచి మరణించిన కార్మికులు, ఉద్యోగులు, ఆర్టిజన్ల కుటుంబాలు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులను అప్పటి జెన్కో యాజమాన్యం జీఓ -6 ను వర్తింపజేస్తూ వివిధ కారణాలను చూపుతూ నిరాకరించిందన్నారు. తమ యూనియన్ అనేక సందర్భాల్లో ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రం అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కానీ నూతన ప్రభుత్వంలోని విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని చొరవతో ఆ జీఓ రద్దయ్యిందన్నారు. ఈ క్రమంలో కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో గతంలో దరఖాస్తు చేసుకున్న వాటిని మరొకసారి కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించే విధంగా యాజమాన్యం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారి, సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, ఎర్రగడ్డ ప్రసాద్, శివరాం, శ్రీనివాస్, బాలు, వేణు తదితరులు పాల్గొన్నారు.


సీఈకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

గొత్తికోయ గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో

దుమ్ముగూడెం, మార్చి 30: మండలంలోని మారుమూల గొత్తికోయ గ్రామం మానుగట్టును శనివారం ఎంపీడీవో ఈదయ్య సందర్శించారు. గ్రామంలో తాగునీటి సదుపాయం ఎలా ఉందని గొత్తికోయలను అడిగి తెలుసుకున్నారు. మరో చేతిబోరు కావాలని వారు అడగడంతో ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ డీఈ శ్రీనివాసరావుకు సూచించారు. ఎంపీఓ ముత్యాలరావు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

జూలూరూపాడు, మార్చి 30: వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించే విధంగా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని వెంగన్నపాలెం, మొద్దులగూడెం, అనంతారం, దుబ్బతండా, నల్లబండాబోడు తదితర గ్రామాలలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవటంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎండల తీవ్రత రోజురోజుకి పెరుగుతుండటంతో తాగునీటి సమస్య జటిలమవుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని ఆయన కోరారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

పాల్వంచ టౌన్, మార్చి 30: 2023-24 ఆర్థిక సంవత్సరంలో లావాదేవీలు జరపని పీపీఎఫ్, సుకన్య, ఎస్‌బీ ఖాతాదారులు తమ అకౌంట్ నెంబరుకు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని పాల్వంచ పోస్టల్ కార్యాలయ సబ్ పోస్ట్‌మాస్టర్ నంద్యాల ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్ నెంబరు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, జిరాక్సులు తీసుకుని సంబంధిత పోస్టాఫీసులో అందచేసి ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు. లేనియెడల ఆ ఖాతాదారులకు సంబంధించిన లావాదేవీలు నిలిపివేయబడతాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

పాల్వంచ టౌన్, మార్చి 30: వేసవికాలం దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాత పాల్వంచ బీసీఎం జాతీయ రహదారి పక్కన గల వీరభద్రవాటర్ సర్వీసింగ్ సెంటరు నిర్వాహకుడు వద్దిపర్తి వీరరాఘవచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరరాఘవచారి గత మూడు సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జి. రాజయ్య, గుమ్మడివల్లి నర్సింహారావు, తిరుమల రమేష్, చంద్రం, ఎన్. వేణు, బి. సత్యనారాయణ, మోత్కూరి రవి, రాము, డాక్టర్ మస్తాన్, తిరుపతి, చిరంజీవి, సీహెచ్. వెంకటేశ్వర్లు, రఘునాధరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 30: తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలో ఉచిత మజ్జిగ పంపిణీ, అలాగే మండుటెండల్లో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి కూడా మజ్జిగ శనివారం పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు చింతపండు రాజ్ కుమార్, ఆర్గనైజర్ చింతపండు శ్రీకర్ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మపురి నరేష్, ఉపధ్యక్షులు లాకావత్ రమేష్, గిరి, మర్రి కృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి చంటి, జిల్లా ఆర్గనైజర్ వెంకట్, పట్టణ కార్యదర్శి మాటేటి వెంకట్, ఉపాధ్యక్షులు మాధవరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు.

వారాంతపు సంత వేలం


సంత వేలంలో పాల్గొన్న అధికారులు

గుండాల, మార్చి 30: వారాంతపు సంతను రూ.లక్షకు దక్కించుకున్నారు. శనివారం గ్రామపంచాయితీ కార్యాలయంలో పంచాయితీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించిన వేలం పాటలో తొమ్మిది మంది పాల్గొనగా లక్ష్మీపురం గ్రామానికి చెందిన సన్న సుగుణారావు రూ.లక్షా 2వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామ్మోహన్‌సింగ్, పిసా కమిటీ సభ్యులు పెండెకట్ల పెంటయ్య, గోవింద నర్సింహారావు, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకుందాం

తుడుందెబ్బ నాయకుల పిలుపు

గుండాల, మార్చి 30: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఉమ్మడి ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకొని ఆదివాసీల ఐక్యత చాటుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితీ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలు మహబూబాద్ పార్లమెంట్ టిక్కెట్ బంజారాలకు కేటాయించి ఆదివాసీలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. నియోజకవర్గంలో ఆదివాసీ ఓటు బ్యాంకు ఎక్కువ ఉన్నందున రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఆదివాసీ అభ్యర్థులను గెలిపించినప్పుడే హక్కులు పరిరక్షింపబడతాయన్నారు. తద్వారా ఆదివాసీల సత్తా చాటాలని కోరారు. ఆదివాసీ నాయకులు ఏ పార్టీల్లో ఉన్నా అంతిమంగా ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంపిడి వెంకటేశ్వర్లు, పూనెం బాలకృష్ణ, వట్టం కన్నయ్య, శ్రీనివాస్, భద్రయ్య, వజ్జ ఎర్రయ్య, మోకాళ్ల కన్నయ్య, వీరభద్రం, గోవింద నర్సింహరావు, చింత వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కుంజ సత్యం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

మోదీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారు..

మానుకోట బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్

భద్రాచలం, మార్చి 30: దేశ ప్రదానిగా ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీని దేశ ప్రజలు కోరుకుంటున్నారని మానుకోట బీజేపీ అభ్యర్థి డా.అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. భద్రాచలంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ మోదీ పరిపాలన తీరు పట్ల యువత ఎంతో ఆకర్షితులయ్యారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తప్పక బీజేపీ సర్కార్ కేంద్రంలో కొలువుదీరనుందని ఈ నేపథ్యంలో మానుకోట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి తనను పార్టీలోకి రావాలని కోరారని దీంతో స్పందించి తాను బీజేపీలో చేరడం జరిగిందని లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాద్ స్థానం నుంచి తనకు పోటీ చేసే అవకాశం ఇచ్చిందన్నారు. ఈ ప్రాంతానికి తాను సుపరిచితుడినని గతంలో ఎంపీగా చేసిన అనుభవం ఉందని, నేను చేసిన అభివృద్ధి మోదీ పాలన కార్యకర్తల సమరోత్సాహం తనను మరోసారి ఎంపీగా గెలిపించేందుకు దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇప్పటికే నిర్దిష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నారని అది ఓటు రూపంలో వేసి బీజేపీ ప్రభుత్వాన్ని కేంద్రంలో అధికారంలోకి తెస్తారని స్పష్టం చేశారు. సీతాంరనాయక్‌తో పాటు రాజ్యసభ మాజీ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్, కుంజా ధర్మా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజ్మీరా సీతారాం నాయక్

వేతన పెంపుపై అవగాహన

దుమ్ముగూడెం, మార్చి 30: ఉపాధి హామీ పథకంలో కొత్తగా వచ్చిన వేతనాల మార్పులపై ఎంపీడీఓ ఈదయ్య శనివారం సిబ్బందికి అవగాహన కల్గించారు. పెంచిన రోజువారి వేతనం రూ.300లు పొందాలంటే ఎంతపని చేయాలనే విషయాన్ని వివరించారు. ఉపాధి కార్మికులు నిర్దేశించిన పని పూర్తిచేసి పూర్తి వేతనం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వేతన పెంపు యొక్క విధివిధానాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ముత్యాలరావు, ఏపీవో సుకన్య, ఈసీలు సందీప్, హరినాద్, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లేబర్ ఆఫీసర్‌కు సీఐటీయూ వినతి

మణుగూరుటౌన్, మార్చి 30: మణుగూరు మండలంలో వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై లేబర్ ఆఫీసర్‌కు శనివారం సీఐటీయు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు గద్దల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మణుగూరులో వివిధ రంగాలైన సినిమా హాల్‌లు, హోటల్‌లు, కిరాణ షాపులు, బంక్‌లు, విద్యరంగంలోని టీచింగ్, నాన్ టీచింగ్‌కు సంబంధించి ఉద్యోగులతోపాటు పలు రంగాలకు చెందిన కార్మికుల సమస్యలను పేర్కొంటు వినతి పత్రమందించామన్నారు. కార్మిక వ్యతిరేక జీఓల రద్దుకు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. కార్మికుల శ్రమ లేనదే పెట్టుబడిదారులకు సంపాదన లేదని అన్నారు. కనీస వేతనాలకై చేపట్టిన ఆందోళనలో బాగంగానే లేబర్ ఆఫీసర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్రపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

డీఎస్పీ చంద్రభాను... ఏజెన్సీ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల సందర్శన


ముత్తారపుకట్ట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

ఇల్లెందు రూరల్, మార్చి 30: రానున్న లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతవారణంలో జరగాలని, ఎటువంటి గొడవలు, ఘర్షణలు జగరకుండా జాగ్రత్తలు పాటించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను నాయక్ సూచించారు. శనివారం ఇల్లెందు మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లోని ముత్తారపుకట్ట, మాసివాగు, మిట్టపల్లి, వీరాపురం, 21ఫిట్ ఏరియాలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఇల్లెందు సీఐ కరుణాకర్, ఎస్ఐ సందీప్‌లతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. పలు గ్రామాల్లో ఉన్న ప్రజలతో మాట్లాడారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని డీఎస్పీ చంద్రబాను కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ

జూలూరుపాడు, మార్చి 30: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తుండటంతో పలు కేంద్రాలను సందర్శించి వసతులను పరిశీలించినట్లు జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని జడలచింత, పాపకొల్లు, అన్నారుపాడు, గుండ్లరేవు, బేతాళపాడు, లైన్ తండా, కరివారిగూడెం, కొమ్ముగూడెం, మాచినేనిపేటతండా, పడమట నర్సాపురం, సాయిరాంతండా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, ప్రహరి, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉన్నాయో లేవో చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన, నగదు తరలించిన కేసులు నమోదు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని కోరారు.

కార్మికుల పని వేళలు మార్చాలి: ఇఫ్టూ

మణుగూరుటౌన్, మార్చి 30: వేసవి అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలను మార్చాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షులు మంగీలాల్ డిమాండ్ చేశారు. శనివారం ఏరియాలోని పీవీ కాలనీ రామాలయం అడ్డాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలో పారిశుధ్యం, సులబ్, కర్మాచారి, రోడ్ల క్లీనింగ్, ఉద్యానవనాలు, నర్సరీలల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఇబ్బందులు పడుతన్నారన్నారు. కార్మికుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ప్రతీ ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా పనివేళల్లో మార్పు చేయాలని కోరారు. దీంతోపాటు సింగరేణి కార్మికులకువలే ఓబీ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు, కోల్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్లకు, డ్రైవర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు ఇవ్వాలని, చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని, మజ్జిగ సకాలంలో అందజేయాలని కోరారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం ఆయా పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కారం భీమయ్య, మంగయ్య, రంగయ్య, నాగరాజు, ఉప్పయ్య, శ్రీరాములు, శ్రీను, రాంబాబు, లక్ష్మీ, కృష్ణమ్మ, మునెమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగీలాల్

లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్మన్‌గా చంద్రమోహన్



ఇల్లెందు, మార్చి30: లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ 320 హెచ్ రీజియాన్ ఛైర్మన్‌గా లయన్ మిరియాల చంద్రమోహన్ ఎన్నికైనట్లు లయన్స్‌క్లబ్ 320 డిస్ట్రిక్ గవర్నర్ ఎన్. మనోహర్‌రెడ్డి ప్రకటించారు. ఇల్లెందు పట్టణానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు మిర్యాల వెంకటేశ్వరావు కుమారుడైన చంద్రమోహన్ అనేక ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆధ్యాత్మిక, ధార్మిక, సంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చంద్రమోహన్ లయన్స్ క్లబ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవలు అందించారు. చంద్రమోహన్‌ను ఛైర్మన్‌గా నియమించడం పట్ల బీజేపీ రాష్ట్ర నాయకులు మావునూరి మాధవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జగన్నాథం, ప్రముఖ న్యాయవాది ఆనంద్ హర్షం వ్యక్తంచేశారు.